గులాబీ జాతరకు కదిలిన దండు

దారులన్నీ బీఆర్ఎస్ రజతోత్సవ సభ వైపే

నేటి ఎల్కతుర్తి సభకు కదులుతున్న శ్రేణులు

- ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు వేల మందికిపైగా..
- ప్రత్యేక వాహనాల్లో తరలించేందుకు ఏర్పాట్లు
- క్షేమంగా తీసుకెళ్లి.. తీసుకురావడంపై ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల శ్రద్ధ
- ఇప్పటికే బయలుదేరిన ముక్రా(కే) గ్రామస్తులు ● పట్టణాల్లో భారీగా బైక్ ర్యాలీలు
- గులాబీమయమైన చౌరస్తాలు ● అభిమానుల్లో కనిపించిన జోష్

రూట్‌మ్యాప్

ఆదిలాబాద్ – గుడిహత్నూర్ – నేరడిగొండ – నిర్మల్ – సోన్ – బాల్కొండ – ఆర్మూర్ – డిచ్‌పల్లి – ఇందల్వాయి – కామారెడ్డి – భిక్నూర్ – పోతరెడ్డిపేట్ – పెద్ద గుండవెల్లి – సిద్దిపేట – బస్వాపూర్ – సముద్రాల – హుస్నాబాద్ – వంగర – ముల్కనూర్ – ఎల్కతుర్తి

కార్యకర్తలకు సూచనలు చేస్తున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

చరిత్రలో నిలిచేలా..

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఏప్రిల్ 26 : వరంగల్ ఎల్కతుర్తిలో నేడు(ఆదివారం) నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండల, గ్రామాల్లో జెండా గద్దె వద్ద గులాబీ తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. ఉదయం గ్రామ, మండలాధ్యక్షులు పార్టీ పతాకాలను ఆవిష్కరించాలని అన్నారు. రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు 45 బస్సులు, 278 కార్లు కేటాయించామని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పార్టీ ముఖ్య నాయకులు బూత్ స్థాయి నుంచి నాలుగు వేల మంది కార్యకర్తలను సభకు తరలించేందుకు కృషి చేయాలని చెప్పారు. పట్టణ కేంద్రంలో డీజేతో ర్యాలీ, పార్టీ పథకావిష్కరణ అనంతరం సిల్వర్ జూబ్లీ వేడుకలకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఇక్కడ రాజగంగన్న, సుమీత్, ప్రదీప్, శ్రావన్, ఖలీల్, నరేందర్‌రెడ్డి, మల్లేశ్, నగేశ్, దివాకర్, మెహ్రాజ్ ఉన్నారు.

యువకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూక్యా జాన్సన్ నాయక్

బీఆర్ఎస్‌లో యువకుల చేరిక

ఖానాపూర్, ఏప్రిల్ 26 : ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం మండలానికి చెందిన 50 మంది యువకులు ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గూలబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట సుమీత్, అబ్దుల్ ఖలీల్, అమర్‌సింగ్, మల్లేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్డీవో ఏపీడీ కుటుంబ రావ్

అధికారులు పనితీరు మార్చుకోవాలి

తాంసి, ఏప్రిల్ 26: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన అధికారులపై డీఆర్డీవో ఏపీడీ కుటుంబ రావ్ ఆగ్రహం వ్యక్తం చేవారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్డీవో ఏపీడీ ఆధ్వర్యంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు చేపట్టిన రూ.2 కోట్ల 90 లక్షల 25,873 ఖర్చుతో 257 రకాల పనులు, రూ.3 కోట్ల 29 లక్షల 16,407 ఖర్చుతో 78 సీసీ రోడ్డు పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో ఏపీడీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పనుల్లో అధికారులు పనితీరు మార్చుకోవాలని లేదా తప్పుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో మొక్కల వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించారు. రిజిస్టర్ల నమోదు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. పలు పనుల్లో తేడాలు కనిపించడంతో నిర్లక్ష్యం వహించిన వారికి జరిమానాతో పాటు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణారావ్, డీవీవో రాజేశ్వర్, డీఆర్పీ కొమురయ్య, ఎంపీడీవో మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

ఇచ్చోడ, ఏప్రిల్ 26 : దాబా (బీ) గ్రామ శివారులో సిందే గజానంద్ కు చెందిన చేనులో శనివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగిం ది. ఈ ప్రమాదంలో ఎకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. 120 క్వింటాళ్ల వరకు పంట నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయా డు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.

జైనథ్ మండలంలోని మాండగడలో పోస్టర్లను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముక్రా(కే) టు వరంగల్ సభ

వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బయలుదేరుతున్న ముక్రా(కే) గ్రామస్తులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ) : ముక్రా(కే) గ్రామస్తులు వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు(ఆదివారం) జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఒక రోజు ముందే బయలు దేరుతున్నామని తెలిపారు. కేసీఆర్ హయాంలోనే ప్రతి ఇంటికి సంక్షేమం అందిందని, కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే పని చేస్తామని, కేసీఆర్ వస్తేనే తెలంగాణ బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో నిర్వహించిన సమావేశం అనంతరం నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

భైంసా : సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : యావత్ తెలంగాణ సమాజం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ.. సమయం రానే వచ్చింది. నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో గులాబీ సైన్యం కదులుతున్నది. ప్రతి నియోజకవర్గం నుంచి మూడు వేల మంది తరలించాలనుకున్నా, అంతకు మించి బయలుదేరుతున్నది. ఒక్కో నియోజకవర్గం నుంచి 60 నుంచి 70 బస్సులు, 30 నుంచి 40 కార్లు ఏర్పాటు చేయగా, నాయకత్వం శ్రేణులను క్షేమంగా చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది.

సెల్ఫీ పాయింట్‌లో ఫొటో దిగిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల ప్రత్యేక దృష్టి

రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో.. దానిని విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాలు నిర్వహించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పలు కార్యక్రమాలు నిర్వహించి.. పార్టీ శ్రేణులు, నాయకులను సమీకరించి సభ జయప్రదంపై చర్చించారు. వివిధ వాహనాలను సమకూర్చారు. భోజన వసతితో పాటు నీటి సౌకర్యం కల్పించారు. శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో వారిని తిగిరి క్షేమంగా ఇళ్లకు చేర్చే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఎక్కడికక్కడ బాధ్యతలు అప్పగించారు.

ఆదిలాబాద్ నుంచి..

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరిలివెళ్లడానికి ఉత్సాహం చూపుతున్నారు. రెండు నియోజకవర్గాల నుంచి దాదాపు పది వేల మంది హాజరుకానుండగా.. నాయకులు వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేటు గార్డెన్‌లో మాజీ మంత్రి జోగు రామన్న నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. సభకు వచ్చేవారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో ప్రయాణిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేరడిగొండలోని ఆయన నివాసంలో 'సెల్ఫీ దిగుదాం, వరంగల్ వెళదాం' అనే నినాదం సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయడంతోపాటు ఫొటోలు దిగారు. జాతీయ రహదారిపై కుప్టీ ఘాట్‌లో ఛలో వరంగల్ వాల్ పెయింట్లను పరిశీలించారు. నియోజకవర్గం నుంచి ప్రజలు భారీ సంఖ్యలో వరంగల్ సభకు తరలిరావాలన్నారు. ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భోరజ్ మండలంలోని మాండగడలో బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్లను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కెర ప్రభాకర్ విడుదల చేశారు.

నిర్మల్‌లో..

నిర్మల్ నియోజకవర్గంలోని సోన్, నిర్మల్ రూరల్ మండలంలోని అత్యధిక సంఖ్యలో క్షేత్రస్థాయి కార్యకర్తలు, మండలస్థాయి నేతలు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జనాన్ని తరలించేందుకు సర్వం సిద్ధం చేశారు. కుభీర్ మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల ముఖ్య ప్రతినిధులతో బీఆర్ఎస్ మండల నాయకులు ఎన్నీల అనిల్, ఎస్కే మొహియొద్దీన్‌లు జనసమీకరణ, తరలింపు, వాహనాల ఏర్పాట్ల అంశాలపై నాయకులతో చర్చించారు. ఖానాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ గద్దెలతోపాటు పట్టణ, గ్రామాల్లో ఫ్లెక్సీ, పార్టీ జెండాలు, తోరణాలతో గులాబీమయం అయ్యాయి. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు దాదాపు నాలుగు వేల మంది సభకు తరలివెళ్లేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారు. కడెం మండలం నుంచి భారీగా తరలివెళ్లనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి తెలిపారు. కడెం మండలం నుంచి 10 బస్సులతోపాటు, 50 కార్లు, ఇతర వాహనాల ద్వారా తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఎల్కతుర్తిలో నిర్వహించనున్న సభకు భైంసా పట్టణ, భైంసా మండలం నుంచి జనం కదిలిరావాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

సోన్ : రజతోత్సవ సభకు ఫ్లెక్సీని కడుతున్న కార్యకర్తలు

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దు చేయాలని రాస్తారోకో

కుభీర్, ఏప్రిల్ 26 : గ్రామ సభలు నిర్వహించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక చేసిన కమిటీలకు బదులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో జాబితా జారీ కావడంపై బీజేపీ శ్రేణులు ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం మండల కేంద్రం కుభీర్‌లోని వివేకానంద చౌరస్తాలో పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ తొత్తులుగా వ్యవహరించడం బాధాకరమని కలెక్టర్ దీనిపై స్పందించి తక్షణం కమిటీల జాబితాను రద్దు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

వివేకానంద చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

రిమ్స్‌లో చిన్నారులకు మెరుగైన వైద్యం

ఆదిలాబాద్, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ) : రిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. శనివారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులతో కలిసి మాట్లాడారు. ఒక రోజు నుంచి 15 ఏండ్ల పిల్లలకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, ఇటీవల పలువురు చిన్నారులకు క్యాన్సర్ వైద్యం అందించినట్లు తెలిపారు. తొమ్మిది నెలల చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించి 15 సెంటీ మీటర్ల ట్యామర్‌ను విజయవంతంగా తొలగించామని, చిన్నారి కోలుకుందని త్వరలో డిశ్చార్జ్ చేస్తామన్నారు. చిన్నారులకు మూత్ర సంబంధిత వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆపరేషన్ల ద్వారా పలు రకాల వ్యాధులను నయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్యుడు దేవీదాస్, గ్యాస్ట్రో వైద్య నిపుణుడు వివేక్, న్యూరో సర్జన్ విజయ్‌మోహన్, డాక్టర్ కార్తీక్, ఈఎన్‌టీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య చికిత్సలు అందించిన చిన్నారులతో వైద్యులు

కేఆర్‌కే కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

ఎదులాపురం, ఏప్రిల్ 26: ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలో శనివారం రాత్రి 250 మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 107 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక మినీ ట్రాలీని తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 31 మంది అనుమానస్పద వ్యక్తులను గుర్తించామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల కోసం డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేకంగా ఐదు గృహాలు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా నాలుగు మద్యం బెల్టు షాపులను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఫింగర్ ప్రింట్ పరికరం ద్వారా 20 మందిని గుర్తించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు ఫణిదర్, సునీల్ కుమార్,కరుణాకర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వెంకటి, ఎస్ఐలు, ఏఎస్ఐలు, స్పెషల్ పార్టీ, రిజర్వ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకును హత్య చేసిన తండ్రి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 24 : తండ్రి కొడుకులు మధ్య ఉన్న పరస్పర గొడవతోనే కన్న కొడుకును తండ్రి హత్య చేసినట్లు ఏఎస్పీ రాజేశ్‌మీనా తెలిపారు. శనివారం నిర్మల్‌లోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. లక్ష్మణ చాంద మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బైనం ఎర్రన్న అతని భార్య గంగవ్వ చాలా సంవత్సరాల నుంచి మాట్లాడుకోవడం లేదు. వారికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. బైనం ఎర్రన్న తల్లితో ఒక గదిలో, అతని భార్య, కుమారుడు వారి పిల్లలు మరో గదిలో నివాసముంటున్నారు. మృతుడు అశోక్ వివాహం కాకముందు ఒకసారి, వివాహం అయిన తర్వాత మరోసారి జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. విదేశాల నుంచి తన తండ్రికి డబ్బులు పంపేవాడు. విదేశాల నుంచి వచ్చాక డబ్బుల లెక్కలు తండ్రిని అడుగగా అతను సరిగా చెప్పకపోవడంతో తరుచూ గొడవ పడేవారు. అలాగే అశోక్ భార్య అతని తండ్రి ఎర్రన్నతో అక్రమ సంబంధం ఉందని అనుమానించేవాడు. గురువారం రాత్రి తండ్రి కొడుకులు గొడవపడి అదే రోజు రాత్రి అశోక్ తన తండ్రిని చంపేస్తానని బెదిరించాడు. ఎర్రన్న తన కుమారుడు ఎలాగైనా తనను చంపేస్తాడని భావించి తానే చంపేయాలనుకున్నాడు. ఇంటి ముందు రేకుల షెడ్డు కింద నిద్రపోతున్న అశోక్‌ను ఎర్రన ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొచ్చి హత్య చేశాడు. అనంతరం గొడ్డలిని తీసుకెళ్లి చిన్నయ్య పొలంలో పడేసి తెల్లవారే వరకు వేచి చూసి లక్ష్మణచాందకు వెళ్లాడు. నిందితుడు లక్ష్మణచాంద బస్టాండులో ఉండగా అనుమానించిన పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. అతను నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

కడెం, ఏప్రిల్ 26 : చిట్యాల్ శివారులో శనివారం చెట్టుపై నుంచి పడి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెంది న కుర్ర మల్లేశ్ (28) మృతి చెందాడు. ముగ్గురు వ్యక్తులు తేనే తీస్తుండగా.. ప్రమాదవశాత్తు కుర్ర మల్లేశ్ చెట్టు పై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేసిన అనంతరం పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

బంద్ ప్రశాంతం

ఖానాపూర్/కడెం, ఏప్రిల్ 26 : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఖానాపూర్, కడెంలలో శనివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.

వివాహితపై లైంగిక దాడి

తానూర్, ఏప్రిల్ 26 : మండలంలోని మొగిలి గ్రామానికి చెందిన వివాహితపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వివాహిత శనివారం ఉదయం గ్రామ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లింది. అదే ప్రాంతంలో దాగి ఉన్న యువకుడు సునీల్ ఆమెను గమనించి వంతెన పైప్‌లోకి ఈడ్చుకుంటా తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి భర్త పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ భానుప్రసాద్ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త ఆత్మహత్య

అనాథలైన ముగ్గురు పిల్లలు

లట్పటే మారుతి (ఫైల్)

గుడిహత్నూర్, ఏప్రిల్ 26 : గుడిహత్నూర్‌లో రెండు రోజుల క్రితం భార్యను హత్య చేసిన భర్త శనివారం మండల కేంద్రానికి అనుకొని ఉన్న వాగు పక్కన ఉన్న కాలువలో శవమై కనిపించాడు. శనివారం జైభీం కాలనీకి చెందిన వారు కాలకృత్యాలను అటు వైపు వెళ్లినప్పుడు దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా లట్పటే మారుతి (31) మృతి చెంది కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే ఓ ప్లాస్టిక్ బాటిల్ పడి ఉండడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటన స్థలాన్ని ఏఎస్పీ కాజల్ సింగ్ పరిశీలించారు. తల్లి చనిపోయిన రెండవ రోజే తండ్రి శవమై కనిపించడంతో వారికి పుట్టిన ముగ్గురు పిల్లలు బాధ అందరిని కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

ఉరివేసుకుని లారీ డ్రైవర్..

నేరడిగొండ, ఏప్రిల్ 26 : నేరడిగొండ మండలంలోని కుప్టి ఘాట్ వద్ద నాగ్‌పూర్‌కు చెందిన మున్వర్ ఖాన్(56) లారీ డ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంత కాలంగా మున్వర్ కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఇటీవల తన ఐచర్ వాహనం కుప్టి ఘాట్ వద్ద బోల్తా పడడంతో పూర్తిగా ధ్వంసమైంది. తనకు ఆర్థికంగా ఆసరా ఉన్న ఐచర్ పనికి రాకుండా పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్న కుమారుడు రోషన్ సలీం పటాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.